క్లుప్తంగా

మున్సిపల్ సమావేశం



పాల్గొన్న పురపాలక సంఘం కౌన్సిలర్లు

రాజంపేట : చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పురపాలకసంఘం కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సాధారణ సర్వసభ్య సమావేశం స్థానిక కౌన్సిల్ హాల్ నిర్వహించారు. పలు అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు మర్రి రవి, సుమియా, కౌన్సిలర్లు సనిశెట్టి నవీన్, న్యాయముతుల్లా, డొంకా సురేష్, పసుపులేటి సుధాకర్, కూండ్ల రమణారెడ్డి, రాముయాదవ్, రాఘవరాజు, విష్ణువర్ధన్‌నాయక్, శ్వేత, చెంగమ్మ, తుపాకుల అశోక్, ఇన్‌చార్జి కమిషనరు డీఈ ఈశ్వరరెడ్డితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు



ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయస్వామి

పుల్లంపేట : మండల పరిధిలోని కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి మంగళవారం పూజారి శివశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

చంద్రబాబును కలిసిన రాయచోటి ఎమ్మెల్యే



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కలిశారు. సోమవారం రాత్రి విజయవాడలోని చంద్రబాబు నివాసంలో మండిపల్లె తన కుమారుడు నిశ్చిల్ నాగిరెడ్డితో కలసి మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు రాయచోటిలో మండిపల్లె విజయంపై అభినందించారు. రాయచోటి అభివృద్ధి కోసం సహకరించాలని టీడీపీ అధినేతను ఎమ్మెల్యే కోరారు. రాయచోటి అభివృద్ధి కోసం తనవంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి

రామాపురం : అన్ని దానాల్లో అన్నదానం మహాగొప్పదని మహాభారత యజ్ఞం కమిటీ ధర్మకర్త రమేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గత మూడు రోజులపాటు జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో మంగళవారం ఉదయం నాట్య మయూరి పి.కౌసల్య భీష్మ విజయం, రాత్రి కృష్ణ లీలలను డ్రామా ద్వారా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమానికి వచ్చే భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రవికుమార్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దామోదర్‌నాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం

కేవీపల్లె : మలేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమని డాక్టర్ రేష్మ అన్నారు. మంగళవారం గర్నిమిట్ట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా సోకిన వ్యక్తి సకాలంలో చికిత్స పొందాలన్నారు. చలితో కూడిన జ్వరం, చెమట పట్టడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కడుపు నొప్పి, వాంతులు, వికారం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అపరిశుభ్రమైన పరిసరాలు, నీటి నిల్వలలో దోమలు వృద్ధి చెంది మలేరియా వ్యాప్తికి దోహదపడుతాయన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు అర్చన, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, పీహెచ్‌ఎన్ రమాదేవి, రుక్మిణి, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రమాద సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి

- హెచ్‌పీసీఎల్‌లో విపత్తుల నివారణకు మాక్ డ్రిల్
- ఆరు నెలలకోసారి మాక్ డ్రిల్ తప్పనిసరి అన్న అధికారులు
- అనుకోని సంఘటనలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తల వెల్లడి



గాయపడిన వర్కర్‌ను పరీక్షిస్తున్న వైద్యుడు శివకుమార్



హెచ్‌పీసీఎల్‌లో మాక్‌డ్రిల్‌లో భాగంగా మంటలను ఆర్పుతున్న దృశ్యం

సిద్దవటం : మండలం లోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో మంగళవారం విపత్తుల సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలో సిబ్బందితో మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించామని కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ–1లో వే నెంబర్ – 3 వద్ద పెట్రోల్ ట్యాంకర్‌లో ఆయిల్ నింపుతుండగా పెట్రోల్ లీక్ అయ్యి కిందపడి పోతుండటంతో అక్కడ ఉన్న వర్కర్‌లు దాన్ని అరికట్టే ప్రయత్నం చేస్తుండగా స్పోనర్ కిట్టు కింద పడిపోవడంతో మంటలు చెలరేగాయి అక్కడ ఉన్న వర్కర్ చూసి ఫైర్ అని గట్టిగా అరవడంతో హెచ్‌పీసీఎల్ సిబ్బంది అప్రమత్తమై ఫైర్ ఎక్కడో చూసుకొని సైరన్ మ్రోగించారు. సిబ్బంది అప్రమత్తమై ఆటోమేటిక్ పరికరాలతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో అక్కడ ఉన్న అగ్నిమాపక పరికరాలతో మంటలను ఆర్పే ప్రయత్నం చేసేందుకు ఐఓసీ, ఏజిపి, ఫైర్ సిబ్బంది సహకారంతో ఫోమ్, వాటర్‌ను ఉపయోగించి మంటలను అదుపులోకి తెచ్చారు. అక్కడ ఇద్దరు వర్కర్‌లకు ప్రమాదం జరగడంతో వారిని స్ట్రెచ్చర్‌తో సిబ్బంది మెడికల్ క్యాంపు వద్దకు తీసుకొచ్చే సన్నివేశాలను మాక్‌డ్రిల్‌లో చేసి చూపించారు.

ఎమర్జెన్సీ –2 వద్ద..

అలాగే ఎమర్జెన్సీ–2లో డీజల్ పైప్ లైన్ వద్ద పిగ్ బ్యారల్ లీక్ కావడంతో అక్కడ వర్కర్ పనిచేస్తుండగా స్పోనర్ కిందపడి మంటలు చెలరేగాయి ఫైర్ అయిందని అక్కడ ఉన్న ఉద్యోగి గట్టిగా కేకలు వేయడంతో హెచ్‌పీసీఎల్ సిబ్బంది మరో సారి సైరన్ మ్రోగించారు. సిబ్బంది అక్కడకు వెళ్లి మంటలను అదుపు చేసేందుకు డీసీపీ ఆపరేట్ చేశారు. ఇక్కడ కూడా ఫోమ్, నీటితో మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో ఒకరు స్వల్ప అస్వస్థతకు గురికావడంతో సిబ్బంది సహకారంతో స్ట్రెచ్చర్‌పై వారిని మెడికల్ క్యాంపునకు తీసుకొచ్చారు. వైద్యుడు డాక్టర్ శివకుమార్ గాయపడ్డ వారిని పరీక్షించారు. ఎమర్జెన్సీ–1లో గాయాలపాలైన ఇద్దరిని పరీక్షించారు. వారిలో ఇద్దరికీ కాలు ఫ్యాచర్ అయినట్లు వైద్యుడు తెలియజేశారు. అన్నీ విభాగాల వారు మాక్‌డ్రిల్‌కు ఎంతో సహకారం అందించారని చీఫ్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణమూర్తి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టప్రకారం 6 నెలలకు ఒకసారి మాక్‌డ్రిల్ చేయడం తప్పనిసరి అన్నారు. విపత్తు జరిగిన ప్రాంతం ఎక్కడో తెలుసుకొని అక్కడ పరిస్థితిని అదుపులోకి తీసుకురావడమే కాక ఉద్యోగులను కాపాడుకోవడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ సతీష్‌కుమార్, ఐఓసీఎల్ డీజీఎం శివరామక్రిష్ణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ బస్మిరెడ్డి, హెచ్‌పీసీఎల్ సేఫ్టీ అధికారి ప్రశాంత్‌కుమార్, బి. ప్రీతీష్‌కుమార్ ఏజీపీ రాజీవ్‌రాజన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, సెక్యూరుటీ సూపర్‌వైజర్ సిద్దారెడ్డి, ఐఓసీ జి.ఆర్.కె. రెడ్డి, హెచ్‌పీసీఎల్ సిబ్బంది, విడీపీఎల్ పైప్‌లైన్ సిబ్బంది, వైద్యసిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ ఆశ వర్కర్ల బాధ్యత

కలకడ : గ్రామాల్లో ప్రజా ఆరోగ్య పరిరక్షణను ఆశావర్కర్ల బాధ్యతగా తీసుకోవాలని డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అజెండా ప్రకారం అతిసార నియంత్రణ, టిఫా, యూఎఫ్‌జి స్కాన్ ప్రాముఖ్యతను, గర్భనిర్ధారణ కిట్లు, ఆశా యాప్ వినియోగం, సమోదు వంటివాటి గురించి తెలియజేశారు. వర్షాకాలంలో మలేరియా, విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున నివారణ మార్గాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ సుబ్బరత్న, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ అధికారి పురుషోత్తం నాయక్, డాక్టర్ యస్దాని ఆశా వర్కర్లకు సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఆశా వర్కర్లతో వైద్య సిబ్బంది సమీక్షించారు. ప్రతి ఆశా వర్కర్ వారి పరిధిలోని గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో టీకాలతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించేలా చూడాలన్నారు.

రేపటి నుంచి అంకాలమ్మ తిరునాల



తిరునాలకు ముస్తాబైన అంకాలమ్మ ఆలయం



అమ్మవారి మూలవిరాట్

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో ఈనెల 13వ తేదీ గురువారం నుంచి అంకాలమ్మ తిరునాల నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈనెల 13వ తేదీ అంకాలమ్మకు చల్లపోయడం, కుంకుమార్చన, అంకాలమ్మ కథ, అంకాలమ్మ, పోతులరాజు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14న అంకాలమ్మకు బియ్యపు కొలత, అమ్మవారి కథ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 15న అంకాలమ్మకు కపిర తీయుట, సాయంత్రం జల్దిలో అంకాలమ్మ ముగ్గువేసి రతనాలను చేసి కొలువు అందించుట 16న ఉదయం జల్ది నుంచి అంకాలమ్మ ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారికి కాయా, కర్పూరాలు సమర్పించి భక్తులు మొక్కుబడులు చెల్లించుకుంటారన్నారు.17న ఉదయం 10 గంటలకు సిద్దయాగం, తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం అమ్మవారి గుడిచుట్టూ సుడిబండ్లు, బోనాల సమర్పణ వంటి పూజలు జరుగనున్నట్టు పేర్కొన్నారు. సాయంత్రం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి బహుమతి, రూ. 70,వేలు, రెండవ బహుమతి రూ. 50,వేలు, మూడవ బహుమతి రూ. 30వేలు, నాల్గవ బహుమతి రూ. 10వేలు అందజేస్తారన్నారు.

సహకార పరపతి సంఘం అధ్యక్షుల రాజీనామా

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె రాచపల్లి సహకార పరతి సంఘం అధ్యక్షులు మంగళవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో రావడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గెలుపొందిన సహకార సంఘం అధ్యక్షులు అయోధ్యపురం పెద్దారెడ్డి, ఆదినారాయణరెడ్డిలు తమ పదవులకు చేసిన రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు. వారితోపాటు కమిటీ మెంబర్లు రాజీనామాలను సమర్పించారు.

ప్రారంభమైన గంగ జాతర



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరులో వెలసిన గంగమ్మ జాతర మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. నిర్వాహకులు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో గుడి వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. నేడు భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకొన్నారు. జాతరను పురస్కరించుకొని ప్రధాన రహదారి నుంచి కొత్తకోడూరు వరకు ప్రత్యేక విద్యుత్ అలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేద్దాం



ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమైన గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందామని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలతో కలిసి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ గ్రామ, మండల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. తాను అధికారంలో ఉన్నన్ని రోజులు అటు రైతుల పక్షాన నిలబడటంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్టు చెప్పారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనవైపు నిలబడి విజయ తీరాల వైపు నడిపించేందుకు కృషి చేశారని, కానీ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందామన్నారు. ఈ ఎన్నికల్లో చేసిన పొరపాట్లను సరిదిద్దుకొని ముందుకు వెళ్లడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని అన్నారు. కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలని, ఇక నుంచి ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షాజహాన్, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్‌రెడ్డి, శంకర్ నాయుడు, సుబ్బరాయుడు, గంగమ్మ ఆలయ చైర్మన్ రెడ్డయ్య, మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, సిద్ధక నాగిరెడ్డి, జనార్దన్ రెడ్డి, గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, మాజీ ఎంపీటీసీ విజయభాస్కర్ రెడ్డి, శివారెడ్డి, లక్ష్మయ్య, ఉప సర్పంచ్‌లు రాజా రెడ్డి, సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు అంబాబత్తిన రమేష్, మాజీ సర్పంచ్‌లు రామచంద్ర, దుర్గయ్య, భవనేశ్వర్ రెడ్డి, దేవేంద్రరెడ్డి, వార్డు మెంబర్‌లు ఖాజా, వరుణ్ కుమార్, బసయ్య, బీసీ నాయకులు విజయభాస్కర్, లల్లు యాదవ్, రవి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, మహ్మద్ రఫీ (గోరా), మాజీ కో–ఆప్షన్ సభ్యులు అహ్మద్ బాషా, అబ్దుల్ నబీ సాహెబ్, నాగరాజు, రమణయ్య, శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇలవేల్పుకు మొక్కులు చెల్లించిన గాలివీటి కుటుంబసభ్యులు



అమ్మవారికి పట్టువస్త్రాలు, పూలమాలలు, గొడుగులు సమర్పిస్తున్న గాలివీటి కుటుంబ సభ్యులు

గాలివీడు : గాలివీడు మండల కేంద్రంలో వెలసిన గాలివీటమ్మకు గాలివీటి కుటుంబసభ్యులు మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారు వారు అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు తమ ఇలవేల్పు అయిన గాలివీటమ్మకు పట్టు వస్త్రాలు, సింహవాహనం సమర్పించడంతోపాటు పూలహారాల గొడుగులు మెరవణిని సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, గాలివీటి మురళీ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువనాయకులు గాలివీటి విజయసాగర్ రెడ్డి తోపాటు వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో బత్యాల పర్యటన



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతసముద్రం పంచాయతీలోని ఎస్టీ కాలనీని సోమవారం మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు, టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య యాదవ్, సుబ్బరామిరెడ్డి తదితరులు సందర్శించారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. అర్హులకు పక్కా గృహాలు నిర్మిస్తామని తెలియజేశారు.

పాడిరైతులు పశువులకు టీకాలు వేయించాలి



సిబ్బందికి సలహాలు ఇస్తున్న డిప్యూటీ డైరెక్టర్

వీరబల్లె : మండలంలో ఉన్న పాడి పశువుల రైతులు, గొర్రెలు, మేకలు ఉన్న రైతులు గొంతువాపు, చిటిక వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపటాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్య తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో పశు వైద్యశాలలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పశువులకు, మేకలకు, గొర్రెలకు చిటిక వ్యాధి, గొంతువాపు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలుగా వ్యాక్సిన్ వేయాలని తెలిపారు. ఇప్పటికే పశువులకు చిటిక వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. మండలంలో రెండు వేలకు పైగా గొంతువాపు వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేశామన్నారు. ఇంకా గ్రామాలలో ఎవరైనా రైతులు తమ పశువులకు టీకాలు వేయకుండా ఉంటే వెంటనే టీకాలు వేయించాలని సూచించారు. పశువులకు ఈ వ్యాధి వస్తే గొంతు వాచి వెంటనే చనిపోతాయన్నారు. కావున ఈ వ్యాధి గురించి రైతులకు గ్రామాలలో అవగాహన కల్పించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి నాగరాజు, వీఎల్‌ఓ జయప్రకాష్, ఏఈఓ రాజేంద్ర, మండల వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద కుటుంబాలను ఆదుకోవాలి

ఒంటిమిట్ట : అధిక విద్యుత్తు సరఫరాతో ఇద్దరు మృతి చెందారని, వారి కుటుంబాలకు రూ.25 లక్షలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్‌లు డిమాండ్ చేశారు. ఒంటిమిట్ట మండలం ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన కోనేటి గంగమ్మ(65), పేరూరు కొండయ్య(51) మంగళవారం విద్యుత్తు షాక్‌తో వారి ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం ఇబ్రహీంపేటలో హై ఓల్టేజ్ వస్తున్నా అధికారులు నిర్లక్ష్యం వహించారని సీపీఎం నాయకులు తెలిపారు. హై ఓల్టేజీ రావడంతో కోనేటి గంగమ్మ ఇంట్లో ఫ్రిడ్జ్ తీస్తుండగా విద్యుత్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందారన్నారు. ఆమెను కాపాడబోయి పేరూరు కొండయ్య మృతి చెందారని తెలిపారు. ఇందుకు విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు ఏఈ, ఏడీఈలు పూర్తి బాధ్యత వహించాలని, చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబీకులను సీపీఎం మండల కార్యదర్శి కోనేటి నరసయ్య పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం సీపీఎం మండల కన్వీనర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీకార దాడుల సంస్కృతికి స్వస్తి పలకండి





మాట్లాడుతున్న రాయచోటి డీఎస్పీ శ్రీనివాసరావ్, హాజరైన వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు

గుర్రంకొండ : గ్రామాల్లో ప్రతీకార దాడులకు అందరూ స్వస్తి పలకాలని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని రాయచోటి డీఎస్పీ శ్రీనివాసరావ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిశాయి. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కలిగించేందకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. అనవసరమైన పరస్పర ప్రతీకార దాడులకు దిగితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించేవారు ఎవరైనా వదిలిపెట్టమన్నారు. అనవసరంగా దూషణలకు దిగడం, ఎదుటివారి వ్యక్తిత్వాలను కించపరుస్తూ వ్యవహరించడం మానుకోవాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారన్నారు. సోషియల్ మీడియాలో అనవసరమైన, అభ్యంతరకరమైన పోస్టులు పెట్టి ఘర్షణలకు కారణమైన వారిని వదిలిపెట్టమన్నారు. నాయకులు పై సూచనలు గుర్తుంచుకొని పోలీసులకు సహకరించాలన్నారు. సమావేశాల్లో వాల్మీకీపురం సీఐ పులిశేఖర్, ఎస్ఐ నాగార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి కె.శివశంకర్ డిమాండ్ చేశారు. కడపలోని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమైన సందర్భంగా ఒకవైపు జిల్లాలోని ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు అమ్ముతూ దోచుకుంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి విద్యా సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనలకు సన్నద్ధమవుతున్నామని తెలియజేశారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు



ఏనుగుల చెరువులో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న దృశ్యం



మామిళ్లవారిపల్లె చెరువులో జేసీబీలు, ట్రాక్టర్లతో అక్రమంగా తవ్వకాలు

- జేసీబీలతో ఇష్టానుసారంగా తోడేస్తున్న దళారులు
- అక్రమ తవ్వకాలు ఆపాలంటున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు

గుర్రంకొండ : కొంతమంది దళారులు చెరువుల్లో యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. జేసీబీలతో చెరువుల్లో ఇష్టానుసారంగా ఇసుక, మట్టిని తవ్వేసి ట్రాక్టర్ల ద్వారా బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. పట్టించుకొని చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చొద్యం చూస్తూ కాలం గడుపుతున్నారు. మండలంలోని తరిగొండ పంచాయతీలో రామానాయిని చెరువులో పెద్ద ఇరిగేషన్ చెరువు. ఈచెరువులో గత వారం రోజులుగా కొంతమంది దళారులు అక్రమంగా జేసీబీలతో చెరువులోని ఇసుకను తోడేస్తున్నారు. రోజంతా ట్రాక్టర్ల ద్వారా బయట ప్రాంతాలకు తరలించుకు పోతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే గ్రామస్తులపై దూషణలకు, దాడులకు పాల్పడుతున్నారు. జేసీబీలు, పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో చెరువుల్లో చేరుకొని ఇష్టానుసారంగా ఇసుకను తరలించుకు పోతున్నారు. బయట మండలాలు, ఇతర ప్రాంతాలకు చెందిన దళారులు ఈ చర్యలకు పాల్పడుతున్నారు. గుర్రంకొండకు సమీపంలోని ఏనుగుల చెరువు, సంగసముద్రం పంచాయతీలో యల్లంపల్లె, మామిళ్లవారిపల్లె చెరువుల్లో జేసీబీలతో ఇసుకతో పాటు, మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రిళ్లు లైట్లు వేసుకొని మరీ జేసీబీలతో ఇసుక తవ్వకాలు జోరుగా జరుపుతుండడం గమనార్హం.

అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఈవిషయమై వీఆర్వో రెడ్డిశేఖర్‌ను వివరణ కోరగా చెరువుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న విషయం వాస్తవమే అన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమ సిబ్బందిపై కూడా దాడులు చేస్తున్నారన్నారు. జరుగుతున్న సంఘటన లపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తగు చర్యలు చేపడతామన్నారు.



తరిగొండ రామానాయిని చెరువుల్లో ట్రాక్టర్లతో ఇసుక తరలింపు